సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 14 । మే । 2023



వాయుపుత్రా.. వందనం

కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధి జై హనుమాన్ నామస్మరణతో మార్మోగింది.

10లో▸



సామూహిక శాంతి హోమాలు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వరదవెల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో దంపతులు శాంతి హోమాలు నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
42.0/26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. ఉక్కపోత అధికమవుతుంది.

అమ్మయాదిలో..

మాతృమూర్తి పేరిట సేవాసంస్థలు

- ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాలు
- అనాథాశ్రమాలు.. ట్రస్టుల ద్వారా చేయూత
- తల్లిపేరు చిరకాలం గుర్తుండేలా సేవా
- నేడు మదర్స్ డే

అమ్మా.. రెండక్షరాల ఆత్మీయ బంధం. సృష్టిలో మొదటిదైవం. మనిషి నూరేళ్ల జీవితానికి మూలకారణం. నవమాసాలు మోసి.. పొత్తిళ్లలో పెట్టుకుని పెంచే అమ్మప్రేమ వెలకట్టలేనిది. తాను పస్తులున్నా.. పిల్లల ఆకలిని తీరుస్తుంది. కష్టమొస్తే అమ్మ కళ్లలోంచి కన్నీళ్లు వస్తాయి. బిడ్డలు ఎదిగితే తల్లి మనసు సంతోషం వ్యక్తం చేస్తుంది. అలాంటి అమ్మంటే ఈ ప్రపంచంలో ప్రేమించనివారు ఉండరు. రక్తంపంచి ప్రాణంపోసి.. చేయిపట్టి జీవితాన్ని ఇచ్చిన అమ్మ తమను వదిలి వెళ్లినా.. ఆ మాతృమూర్తికి చిహ్నంగా అమ్మయాదిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన చాలా మంది పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనాథాశ్రమాలు.. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారిని చేరదీస్తున్నారు. కొందరు అనాథ పిల్లలకు అమ్మగా మారుతుండగా.. మరికొందరు అనాథవృద్ధుల్లో తమ తల్లులను చూసుకుంటున్నారు. అమ్మకు ప్రేమతో సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారిపై మాతృదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..!!

రంగినేని ఎల్లమ్మ పురస్కారాలు

సిరిసిల్ల:అమ్మ యాదిలో కవులు, రచయితలను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా సాహిత్యపు పండగను సిరిసిల్ల శివారులోని 'రంగినేని' ట్రస్ట్‌లో నిర్వహిస్తారు. రంగినేని ఎల్లమ్మ పేరిట ఆమె తనయుడు రంగినేని మోహన్‌రావు రెండు దశాబ్దాలుగా సాహిత్య పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు.తల్లిదండ్రులు లేని పిల్లలకు రంగినేని సుజాత మోహన్‌రావు ట్రస్ట్ అండగా నిలుస్తోంది.1,243 మంది పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించారు. 151 మంది ఉద్యోగాలు సాధించారు. పిల్లలు, వృద్ధుల కోసం ట్రస్ట్ నిర్వహిస్తున్నాం అని వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు వివరించారు.



2021లో రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారాన్ని వెంకట్ సిద్దారెడ్డికి అందిస్తున్న 'సాక్షి' ఎడిటర్ వర్ధెల్లి మురళి(ఫైల్)

చదువులకు భరోసానిస్తూ..



పాఠశాలకు డెస్కులు అందిస్తున్న గంగప్రసాద్


కథలాపూర్(వేములవాడ):తల్లి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేశారు కథలాపూర్ మండలం తాండ్ర్యాలకు చెందిన అన్నదమ్ములు గుజ్జెటి గంగప్రసాద్, గుజ్జెటి శ్రీనివాస్. గంగప్రసాద్ ముంబయిలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేస్తున్నాడు. తల్లి గుజ్జెటి శంకరవ్వ 20ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. తల్లి జ్ఞాపకార్థం 'గుజ్జెటి శంకరవ్వ' ట్రస్ట్ ఏర్పాటు చేశారు. తాము చదువుకున్న పాఠశాలకు సౌండ్ సిస్టమ్స్, కంప్యూటర్లు, డ్యూయల్ డెస్కులు అందించారు.

అమ్మ గుర్తుగా..

జ్యోతినగర్(రామగుండం): గోదావరిఖని ఎల్కలపల్లి గేట్‌ప్రాంతానికి చెందిన దాసరి మహేశ్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. కష్టపడి మంచం పట్టిన తల్లిని చూసుకున్నాడు. కొన్నాళ్లకు తల్లి కూడా తుదిశ్వాస విడిచింది. అభాగ్యులకు అమ్మపేరిట సాయం చేయాలని సంకల్పించి 2012లో తల్లి 'ప్రేమలత' పేరుతో 'ప్రేమ' చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశాడు. ప్రయివేటు ఉద్యోగం చేసే మహేశ్ తనకు వచ్చే వేతనం నుంచి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు సామాజిక కార్యక్రమాలకే వెచ్చిస్తున్నాడు. అనాథల ఆకలి తీరుస్తున్నాడు. పేద పిల్లల చదువుకు సాయం చేస్తున్నాడు. వృద్ధులను చేరదీస్తున్నాడు. ఈయన సేవలు గుర్తించి పలు సంఘాలు జాతీయ అవార్డులతో సత్కరించాయి.



ట్రస్టులో సేవలందిస్తున్న మహేశ్



ఆకలి తీరుస్తూ..

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ రేకుర్తిలోని విజయపురికాలనీకి చెందిన గోదరి జితేందర్ తన అమ్మపేరిట నిర్వహిస్తున్న నిత్యాన్నదానం 899రోజుకు చేరుకుంది. రెండేళ్లవయస్సులోనే తల్లిని కోల్పోయిన జితేందర్ అమ్మ కోసం ఏదైనా చేయాలనే సంకల్పంతో 2016 ఫిబ్రవరి 15న 'గోదరి కాంతలక్ష్మి సేవా సమితి' ఏర్పాటు చేశాడు. అన్నార్థులు, అనాథలు, నిరాశ్రయులు, అభాగ్యులకు 2020 నవంబర్ 27 నుంచి నిత్యాన్నదానం నిర్వహిస్తున్నాడు. ప్రతీరోజు 50 నుంచి 70మందికి కడుపునిండా భోజనం అందిస్తున్నాడు. వైద్య, రక్తదాన శిబిరాలు, ఓటరు, పర్యావరణంపై అవగాహన, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఒంట్లో జీవం ఉన్నంతవరకు అమ్మపేరిట సేవ చేస్తా అని జితేందర్ చెప్పుకొచ్చాడు.



నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్న జితేందర్

నేడు చీరల పంపిణీ

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన గంగిశెట్టి మధురమ్మకు ఐదుగురు కొడుకులు. చిన్నకొడుకు జగదీశ్వర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవలే జమ్మికుంట పాఠశాలలో ఉద్యోగ విమరణ పొందాడు. తల్లి మధురమ్మ 14ఏళ్ల క్రితం మృతి చెందింది. 2017లో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఏర్పాటు చేశాడు. ఇప్పటివరకు రూ.40లక్షలు సేవా కార్యక్రమాలకు వెచ్చించాడు. 26మండలాల్లో రూ.2లక్షల విలువ చేసే 7వేల పరీక్ష ప్యాడ్లు, 76పాఠశాలలో ప్లేట్లు, డిక్షనరీలు, క్రీడా సామగ్రి, నోట్‌బుక్స్, తదితర సామగ్రి అందించాడు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా 200మంది మహిళలకు అమ్మ జ్ఞాపకంగా చీరలు పంపిణీ చేయనున్నట్లు జగదీశ్వర్ తెలిపారు.




గతేడాది మదర్స్ డే సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

అమ్మ ఒక సముద్రం

- ప్రముఖ కథ రచయిత కెవి.నరేందర్

జగిత్యాల: అమ్మ గురించి ఎవరెంత రాసినా.. సముద్రాన్ని దోసిళ్లతో తోడినట్టే అంటున్నారు ప్రముఖ రచయిత కేవీ.నరేందర్. అమ్మపేరుతో 20ఏళ్ల క్రితం తన తొలికథ సంకలనాన్ని వెలువరించారు. ఆ సంపుటి నరేందర్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఆ కథలు రాయడానికి గల స్ఫూర్తిని మదర్స్‌డే సందర్భంగా 'సాక్షి'తో నరేందర్ పంచుకున్నారు. '20 ఏళ్ల క్రితం మంథని డివిజన్‌లోని ఓ గ్రామానికి సర్పంచ్ ఎలక్షన్ల డ్యూటీకి వెళ్లాను. ఓ ముసలావిడ రెండు గుర్తుల పైన ఓటు వేసింది. అది గమనించిన నేను అవ్వ ఓటు చెల్లదేమో? అన్నాను. పోటీ పడుతున్నది ఇద్దరు నా కొడుకులే అని ఓటు డబ్బాలో వేసి వెళ్లిపోయింది. ఆ ఓటు చెల్లకపోవచ్చు. కానీ తల్లి ప్రేమకు అంతకన్న గొప్ప నిదర్శనం ఏమి ఉంటుంది. అదే విషయాన్ని అమ్మను పంచుకుందాం పేరుతో కథగా మలిచాను. ఇది 'ఆటా' అమెరికా తెలుగు అసోసియేషన్ సంఘం వారు ప్రత్యేక సంచికలో వేశారు. మండలాధ్యక్షురాలిగా ఉన్న ఇద్దరు పిల్లల తల్లి మూడోసారి గర్భం ధరించగానే ప్రత్యర్థులు అవిశ్వాసం పెట్టారు. భర్తను తిట్టయినా పదవీని వదులుకుంది గానీ గర్భాన్ని తీయించుకోలేదు. ఆదిలాబాద్ జిల్లా వెన్నెల మండలంలో జరిగిన సంఘటన ఇదీ. దీని ఆధారంగానే అవిశ్వాసం అనే కథ రాశాను. ఓల్డేజీ హోమ్‌లు ప్రతి నగరంలో విస్తరించడాన్ని ఒక తల్లి సమర్థిస్తే ఆశ్చర్యపోయాను. పిల్లల మనస్థత్వాన్ని తల్లి మాత్రమే అంత గొప్పగా విశ్లేషించగలదని అర్థమయ్యాక 'సాక్షి'లో రెక్కలు అనే కథ రాశాను. అమ్మ కథ సంకలనంలోని 14కథలు ఇలాంటి స్ఫూర్తితో రాసినవే'. అని నరేందర్ వివరించారు.



అమ్మ కథ సంపుటి



కెవి.నరేందర్

అమ్మ నాకు బెస్ట్ ఫ్రెండ్

- రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ(రామగుండం): 'అమ్మ నాకు బెస్ట్‌ఫ్రెండ్.. అమ్మతో చాలా విషయాలు షేర్‌చేసుకుంట.. నా కూతురుతో కూడా నేనుబెస్ట్ ఫ్రెండ్‌గా ఉంటున్నా' అని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్ తెలిపారు. 'మదర్స్‌డే' సందర్భంగా తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. అమ్మ శాంతిసింగ్ గైనకాలజిస్టు. నాన్న కృష్ణాసింగ్ సర్జన్. అమ్మనాన్న వయసు పెరగడంతో ప్రస్తుతం అమెరికాలోని మా బ్రదర్స్ దగ్గర ఉంటున్నారు. అమ్మనాన్న ఇద్దరూ డాక్టర్ కావడంతో నేను కూడా డాక్టరయ్యాను. నా భర్త కూడా డాక్టర్. దీంతో మా కూతురు కూడా మెడిసిన్ చేసింది. మాకు ఇద్దరు కుమారులు, కూతురు. పెద్ద బాబు ఐదేళ్ల క్రితం కేన్సర్‌తో మరణించాడు. అప్పుడు చాలా డిప్రెషన్‌కు గురయ్యాను. అమ్మ నన్ను చాలా ఓదార్చింది. మేం కలిసినప్పుడల్లా ఇద్దరిలో నవ్వులే ఉంటాయి. మా కూతురుతో కూడా ఫ్రెండ్‌గా ఉంటున్న. ప్రొఫెషనల్‌గా నేను బీజీగా ఉన్నప్పటికీ నాకు హెల్ప్‌గా ఉంటూ చాలా ఫ్రీడం ఇస్తుంది. ప్రస్తుత జనరేషన్ పిల్లలు అమ్మకున్న ఇబ్బందులు తెలుసుకోవాలి. అమ్మ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉండకుండా అన్నిపనుల్లో తోడుగా ఉండాలి.



డాక్టర్ హిమబిందు సింగ్

అనిల్ కుటుంబానికి మాజీ ఎంపీ పొన్నం పరామర్శ

బోయినపల్లి(చొప్పదండి): జమ్మూకాశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని మల్కాపూర్‌కు చెందిన పబ్బాల అనిల్ కుటుంబాన్ని శనివారం సాయంత్రం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. యువ సైనికుడి మృతి తీరని లోటు అన్నారు. అనిల్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఆయన వెంట నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బోయిని ఎల్లేశ్, ఏనుగుల కనుకయ్య, బాబు, గుడి శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కోనసీమ కల నెరవేరబోతోంది..

- మల్కపేట ప్రాజెక్ట్ పనులపై ఎమ్మెల్యే సమీక్ష
- త్వరలో సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభం

కోనరావుపేట: కోనరావుపేట కోనసీమ కల త్వరలోనే నెరవేరబోతోందని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. రూ.504 కోట్లతో నిర్మిస్తున్న మల్కపేట ప్రాజెక్ట్ పనులు, రూ.163 కోట్లతో నిమ్మపల్లి ప్రాజెక్ట్ పనులపై మల్కపేట రిజర్వాయర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్యాకేజీ 9 లో నిర్మిస్తున్న మల్కపేట రిజర్వాయర్ ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని చంద్రగిరి, జయవరం, లింగంపెల్లి, మారుపాక, తిప్పాపూర్‌లో 5,601 ఎకరాలు, కోనరావుపేట మండలంలోని ధర్మారం, కనగర్తి, కొలనూర్, పల్లిమక్త, మల్కపేట, మర్తనపేట, నాజాగారం, నిజామాబాద్, రామన్నపేట, సుద్దాల గ్రామాల్లోని 26,694 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. దాదాపు 90శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు మరో 20 రోజుల్లో పూర్తి చేయాలని ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, ఈఈ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. కొద్దిరోజుల్లోనే సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభిస్తామన్నారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిది..

వేములవాడఅర్బన్: ముంపు గ్రామాల నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని శాభాష్‌పల్లిలో శనివారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మిడ్‌మానేరు ముంపు గ్రామాల త్యాగంతోనే 55 వేల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. మహిళా సంఘ భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, సర్పంచ్ పండుగ ప్రదీప్ ఉన్నారు.

కాషాయవర్ణమైన రాజన్న క్షేత్రం



రాజన్న క్షేత్రంలో హనుమాన్ దీక్షాపరులు

వేములవాడ: హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం వేములవాడ రాజన్న క్షేత్రం కాషాయవర్ణమైంది. ఆదివారం హనుమాన్ జయంతి కావడం.. ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకుని వెళ్లే సాంప్రదాయం ఉండడంతో రాజన్న క్షేత్రం యావత్తు కాషాయవర్ణ భక్తులతో రద్దీగా మారింది.

క్లుప్తంగా

రైతుల సంక్షేమమే 'సహకార' లక్ష్యం


పనులు పరిశీలిస్తున్న రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలో ప్రాథమిక సహకార సంఘాలు రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నాయని, రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి అన్ని సంఘాల పరిధిలో గోదాంల నిర్మాణాలు జరుగుతున్నాయని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేటలో నిర్మాణంలో ఉన్న గోదాం, బ్యాంక్ భవన సముదాయాలను శనివారం ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో లక్ష్యంలోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. మొుదటి అంతస్తులో బ్యాంక్ నిర్వహించాలని, దీంతో వృద్ధులు, వికలాంగులకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. పైఅంతస్తులో ప్రాథమిక సంఘం భవనాన్ని కొనసాగించాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, బందారపు బాల్‌రెడ్డి, పిల్లి కిషన్ ఉన్నారు.

కర్ణాటక ఫలితమే తెలంగాణలో..



సిరిసిల్లటౌన్: కర్ణాటకలో వచ్చిన అసెంబ్లీ ఫలితాలు మరో ఆర్నెళ్లలో తెలంగాణ లో జరిగే ఎన్నికల్లో పునరావృతం అవుతాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మోదీ నియంతృత్వ పాలనను ప్ర జలు వ్యతిరేకిస్తున్నారని, ఇందుకు కర్ణాటక ఎ న్నికలే నిదర్శనమని పేర్కొన్నారు. దేవుడి పేరుతో రాజకీయం చేసే వారికి ప్రజలు తగిన రీతి లో బుద్ధి చెప్పారని తెలిపారు. రాష్ట్ర సర్కారు నియంతృత్వపు ధోరణిపైనా ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, బీఆర్ఎస్‌కు రాబోవు ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని తెలిపారు. ప్రజా సమస్యలపై పార్టీ గ్రామగ్రామాణ ప్రజలతో మమేకమై ఉంటుందని, రాబోవు ఎన్నికల్లో తమ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని భ వానీనగర్‌కు చెందిన గందం దుర్గయ్య(60) వడదెబ్బతో మృతిచెందాడు. దుర్గయ్య చిలుక జోస్యం చెప్పడానికి శనివారం సైకిల్‌పై వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో నర్సింగాపూర్ శివారుకాలువవద్ద అస్వస్థతతో మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని మేడిపల్లి గ్రామం వద్ద శనివారం సాయంత్రం ఆటో ఢీకొని ద్విచక్రవాహనదారుడు మాడ హన్మండ్లు (40)అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాలు.. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం మల్లారం గ్రామానికి చెందిన మాడ హన్మండ్లు, కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం చిన్నదేవడ గ్రామానికి చెందిన దు ర్కి లక్ష్మణ్ ద్విచక్రవాహనంపై మెట్‌పల్లి నుంచి నిజామాబాద్ వెళ్తున్నారు. మేడిపల్లి వద్ద ఆటో ఢీకొనడంతో హన్మండ్లు మృతిచెందగా, దుర్కి లక్ష్మణ్‌కు గాయాలు కావడంతో మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉమసాగర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


రాజన్న గుడి ముందు కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


ఎల్లారెడ్డిపేటలో కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

వేములవాడ: కర్ణాటక రాష్ట్ర ప్రజలు మత రాజకీయాలకు స్వస్తి పలికారని, ప్రజలపక్షం ఉండే కాంగ్రెస్ పార్టీకే సంపూర్ణ మద్దతు ప్రకటించారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలో కాంగ్రెస్ జెండాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. రాజన్న గుడి ముందు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రం ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ కాబట్టి దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నాయకులు సాగారం వెంకటస్వామి, కనికరపు రాకేశ్, నాగం కుమార్, కూరగాయల కొమురయ్య, నాగుల విష్ణు, దాడి మల్లేశం, నాగుల మహేశ్, తోట లహరి, నూగూరి లక్ష్మి, మస్తాన్, లింగంపల్లి కిరణ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక విజయం నాందిగా భావించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కర్ణాటక విజయం తెలంగాణలో ఊపునిచ్చిందని, ఈ విజయాన్ని రాష్ట్ర ప్రజలు నాందిగా భావించాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి అన్నారు. కర్ణాటక విజయంపై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం సంబరాలు నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యకర్తలు ఇప్పటినుంచే కష్టపడి పనిచేయాలన్నారు. ఒక ప్రణాళికతో కార్యకర్తలు ప్రజలకు అధికార పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, చిన్నిబాబు, రాజునాయక్, పోచయ్య, షకిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

సిరిసిల్ల టౌన్ : కర్ణాటకలో అసెంబ్లీ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయంపై సిరిసిల్లలో ఆపార్టీ నేతలు సంబరాలు జరిపారు. గాంధీచౌక్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ గౌడ్, నాయకులు ఆకునూరి బాలరాజు, కాముని వనిత, సూర దేవరాజు పాల్గొన్నారు.

ముస్తాబాద్ మండలకేంద్రంలో..

ముస్తాబాద్ : మండలకేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్రరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట : పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మండలకేంద్రంతోపాటు నిమ్మపల్లి పలు గ్రామాల్లో పటాకులు కాల్చి సంబరాలు జరిపారు.

ఇల్లంతకుంట : మండలకేంద్రంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లు గెలిచి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పసుల వెంకటి, బాలపోచయ్య, నరేశ్, జమాల్, ప్రసాద్, రాజేశం, రమేశ్, వీరేశం, హైదర్, అశోక్, రవి, తదితరులున్నారు.

తంగళ్లపల్లిలో ..

తంగళ్లపల్లి: తంగళపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు.

చందుర్తిలో..

చందుర్తి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, నాయకులుపాల్గొన్నారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి: మండలకేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బోయిని ఎల్లేశ్, పులి లక్ష్మిపతి, ఏనుగుల కనుకయ్య, ప్రశాంత్, బాబు, దూస జనార్దన్, లచ్చయ్య తదితరులున్నారు.

సంకెపల్లిలో..

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం సంకెపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం సంబరాలు జరిపారు. పార్టీ మండల అధికార ప్రతినిధి రగుడు పర్శరాములు, రాజు కుమార్, రాజమల్లు, శ్రీనివాస్, లింగయ్య, వెంకటేశ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థిని దుర్మరణం


రుచిత(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్, సిరిసిల్ల ప్రధాన రహదారిపై నామాపూర్ మానేరు కెనాల్ మూల మలుపు వద్ద లారీ, బైక్‌ను ఢీకొన్న సంఘటనలో బీటెక్ విద్యార్థిని దుర్మరణం పాలైంది. సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం బంజేరుపల్లికి చెందిన శాగ రుచిత (20), ఆమె సోదరి శాగ సుహిత, గూడెం గ్రామానికి చెందిన నడిమెల వంశీ గూడెంలో జరిగిన ఓ శుభకార్యాలంలో పాల్గొని ద్విచక్రవాహనంపై బయల్దేరారు. నామాపూర్ మానేరు కెనాల్ మూల మలుపు వద్దకు రాగానే వేగంగా వస్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో రుచిత తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. వంశీ కాలు, చేయి విరిగింది. సుహితకు గాయాలయ్యాయి. వంశీ హెల్మెట్ ధరించడంతో తలకు గాయాలు కాలేదు. లారీ ఇద్దరు అక్కాచెల్లెళ్లను ఢీకొట్టగా.. రుచిత చనిపోయింది. రుచిత హైదరాబాద్‌లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. సుహిత ఇంటర్ పూర్తి చేసింది. 'పెద్ద చదువులు చదువుతున్నవ్ బిడ్డా.. పెద్ద కొలువులో చేరి అందరిని చూసుకుంటవనుకున్నం.. దేవుడా నా బిడ్డ ఏం పాపం చేసిందని తీసుకుపోయినవ్..' అంటూ ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించిన దృశ్యం అందరిని కలిచివేసింది. పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి కారణమైన లారీని ఠాణాకు తరలించారు. రుచిత తండ్రి గోవర్దన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఉపేందర్ తెలిపారు.

కర్ణాటకీయంలో మనోళ్ల పాత్ర అదుర్స్

- కాంగ్రెస్ గెలుపులో జిల్లా నేతల కీలకపాత్ర
- శ్రీధర్ బాబు నేతృత్వం వహించిన నియోజకవర్గాల్లో విక్టరీ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కర్ణాటకలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించి చరిత్ర సృష్టించింది. శనివారం విడుదలైన ఫలితాలు కాంగ్రెస్‌కు పట్టం కట్టాయి. పొరుగు రాష్ట్రం కావడం, మన రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలలే సమయం ఉండటంతో ఈ ఎన్నికల ప్రభావం మన రాష్ట్రంపైనా ప్రభావం చూపిస్తుంది. ఆ మేరకు సంబంధాలు ఉన్నాయి కాబట్టే.. అక్కడ మన రాష్ట్రం నుంచి అందులోనూ ఉమ్మడి జిల్లాల నుంచి బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి పలువురు నాయకులు వెళ్లి ప్రచారం నిర్వహించి వచ్చారు. ఎవరెవరు ఎక్కడ ప్రచారం చేశారో ఒకసారి పరిశీలిద్దాం.!

- కర్ణాటకలోని గుల్బర్గా, బీదర్, యాదగిరి నియోజకవర్గాల్లో జగిత్యాల జిల్లా నుంచి డీసీసీ అధ్యక్షుడు ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పాల్గొన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపొందింది.
- మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్ బాబు కళ్యాణ కర్ణాటకకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఏఐసీసీ కార్యదర్శి మల్లికార్జున ఖర్గే ఏరియాలోని ఏడు జిల్లాల్లో 41 అసెంబ్లీ నియోజకవర్గాలకు శ్రీధర్ బాబు ఇన్‌చార్జిగా ఉన్నారు. రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్రకు ముందు నుంచి ఇక్కడి రాష్ట్రంలో శ్రీధర్ బాబు పార్టీ వ్యవహారాల్లో సమన్వయం చేస్తున్నారు.
- నిజాంబాద్ మాజీ ఎంపీ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాలుపంచుకున్నారు.
- పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్ ఠాకూర్ ప్రచారం నిర్వహించిన కళ్యాణ్ గుల్బర్గాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు.

కమలనాథులకు ప్రతికూలమే..!

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. కల్బుర్గి రూరల్ జిల్లా సేడం, చించోలి నియోజకవర్గాలలో ప్రచారం చేశారు. చించోలిలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించగా, సేడంలో కాంగ్రెస్ గెలిచింది. మధుగిరి జిల్లాలోని సిర, మధుగిరి, పవగడ నియోజకవర్గాల ప్రచారంలోనూ పాల్గొన్నారు. ఈ మూడింట్లోనూ కాంగ్రెస్ విజయం సాధించింది.
- కర్ణాటకలో బండి సంజయ్.. చింతామణి, ములబాగల్, బాగేపల్లి, గౌరీబిదనూర్, చిక్కబల్లాపూర్ స్థానాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగు ప్రజలు అధికంగా ఉన్న కోలార్, చింతామణి, ముల్బగల్ నియోజకవర్గాల్లో బీజేపీ మూడో స్థానానికే పరిమితమైంది. ఇక గౌరీబిదనూర్‌లో ఐదో స్థానానికి.. బాగేపల్లి, చిక్కబల్లాపూర్‌లో భారీ వ్యత్యాసంతో ఓటమి చవిచూసింది.

సంజయ్.. వినోద్ ఇద్దరూఇద్దరే..

- బీజేపీ దేవుళ్ల పేరుతో రాజకీయం
- మెగాపార్క్ విషయంలో సిరిసిల్లకు అన్యాయం
- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల: మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను వరంగల్‌కు తరలించి సిరిసిల్లకు అన్యాయం చేశారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సిరిసిల్లకు కాకుండా తన సొంత జిల్లా అయిన వరంగల్‌కు మెగా టెక్స్‌టైల్ పార్క్ తరలించుకుపోయారని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వడంతో ఛత్తీస్‌గఢ్ ఎంతో ఆదర్శంగా ఉందని, ఈ విషయాన్ని తెలుసుకునేందుకు వినోద్‌కుమార్‌తో కలిసి ఆ రాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని, అవసరమైతే విమాన టికెట్లు కూడా తీసుకుంటామన్నారు. ఎప్పుడు వెళ్దామో చెప్పాలని సవాల్ విసిరారు. అక్కడి ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని రూ.2060కి కొనుగోలు చేస్తూ.. ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తోందని తెలిపారు. వినోద్‌కుమార్ కుసంస్కారి అని, ఆయన వాస్తవాలను గుర్తించకుండా తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయమైన డిమాండ్లతో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లను తొలగిస్తామని ప్రభుత్వం బెదిరించడం సరికాదన్నారు. జేపీఎస్‌లను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జిల్లాకు ఏం చేశారో చెప్పాలన్నారు. హిందూ ఏక్తాయాత్ర పేరిట ప్రశాంతంగా ఉన్న కరీంనగర్‌లో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మతం పేరిట రాజకీయాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ విజయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

నేతన్నలకు బీజేపీ ఏంచేసింది..?

సిరిసిల్లటౌన్: ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు ఇద్దరూ ఇద్దరేనని పొన్నం విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాముడు, హనుమంతుడంటూ బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. ఎంపీ బండి ఏడాదికాలంగా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు బీజేపీ ఎందుకు మద్దతివ్వడం లేదని, వారు హిందువులు కాదా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం

వీర్నపల్లి (సిరిసిల్ల): వీర్లపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పొన్నంతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తేవాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం 30 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరగా.. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు, కేతిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కూర రవీందర్, కాముని వనిత, సూర దేవరాజు పాల్గొన్నారు.





వాయుపుత్రా.. వందనం

మల్యాల(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధి జై హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు వందల కిలోమీటర్ల దూరం నుంచి కాలినడకన కొండగట్టుకు చేరుకున్నారు. సుమారు 50వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. మరో రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఇల్లంతకుంట: మండలంలోని రేపాకలో పేకాట స్థావరంపై ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసులను చూసి మరో ఐదుగురు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. వారి నుంచి రూ.9,690 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సెక్కబోతూ పడి ఒకరికి గాయాలు

వేములవాడఅర్బన్: ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కబోయిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్రంగా గాయపడిన ఘటన వేములవాడ ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నాంపెల్లికి చెందిన అంజయ్య తిప్పాపూర్ నుంచి నాంపెల్లి వైపు వెళ్లేందుకు కదులుతున్న బస్సును ఎక్కేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్ట్

చందుర్తి (వేములవాడ): బ్లూకోల్ట్స్ విధులకు హాజరైన కానిస్టేబుల్‌ను దుర్భాషలాడిన నర్సింగపూర్‌కు చెందిన కొమ్మనపల్లి మహేశ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. విధుల్లో భాగంగా నర్సింగపూర్‌కు వెళ్లిన కానిస్టేబుల్ సమియుల్లాను పాత కేసులో నిందితుడు మహేశ్ అడ్డుకున్నాడు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై వివరించారు.

ముగ్గురి రిమాండ్

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి పరిధి కేసీఆర్‌నగర్ సమీపంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పట్టుకుని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పి.లక్ష్మారెడ్డి తెలిపారు. వీరికి గంజాయి విక్రయించిన వ్యక్తి పరారీలో ఉన్నాడని తెలిపారు.

సప్లిమెంటరీ' ఫీజు గడువు ఈనెల 16

గంభీరావుపేట: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజును ఈనెల 16లోపు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్ తెలిపారు.

శుభకార్యానికి వెళ్తూ.. మృత్యు ఒడిలోకి..

- ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు
- భార్య కళ్లముందే తల పగిలి భర్త మృతి


రాజ్‌మహ్మద్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): బంధువు ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్తుండగా.. విధి రోడ్డు ప్రమాదం రూపంలో ఒకరిని బలిగొంది. ఈ సంఘటన జోగాపూర్‌లో విషాదం నింపింది. మండలంలోని జోగాపూర్‌కు చెందిన రాజ్‌మహ్మద్(54), అతడి భార్య కుప్రభీతో కలిసి ద్విచక్ర వాహనంపై వేములవాడలోని బంధువుల ఇంటికి శుభ కార్యానికి బయల్దేరారు. మూడపల్లి బస్టాండ్ సమీపంలో ముందు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజ్‌మహ్మద్‌కు తలకు బలమైన గాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలించేందుకు యత్నించే క్రమంలోనే మృతి చెందాడు. కుప్రభీని పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

హెల్మెట్ ధరించినా బతికి వాడేమో..

రాజ్‌మహ్మద్ హెల్మెట్ ధరిస్తే గాయాలతో బయటపడేవాడని స్థానికులు చర్చించుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇచ్చినా.. వారు సకాలంలో స్పందించలేదని ఆరోపిస్తున్నారు. 45 నిమిషాల వరకూ అంబులెన్స్ రాకపోవడంతో మృతిచెందాడని పేర్కొంటున్నారు.

15 రోజుల క్రితమే పెద్ద కుమారుడు గల్ఫ్‌కు..

జీవనోపాధి కోసం రాజ్‌మహ్మద్ పెద్ద కుమారుడు రఫీక్ 15 రోజుల క్రితమే దుబాయ్ వెళ్లాడని, తండ్రి చివరి చూపునకు నోచుకోవడం లేదని బంధువులు కన్నీటిపర్యంతమవుతున్నారు. చిన్న కుమారుడు రషీద్‌తోపాటు రాజ్‌మహ్మద్ గ్రామంలోనే చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టాడని స్థానికులు చెబుతుండగా.. ట్యాంకర్ రోడ్డుపై నిలిచి ఉండదని పోలీసులు భావిస్తున్నారు. ట్యాంకర్‌కు ఏదైనా అడ్డు వస్తే సడన్ బ్రేక్ వేయగా.. ద్విచక్ర వాహనం ఢీకొట్టిందా..? అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ట్యాంకర్ డ్రైవర్ ద్వారానే పూర్తి వివరాలు తెలుస్తాయని స్థానికులు చెప్పుకుంటున్నారు.

క్లుప్తంగా

15 నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు

గంభీరావుపేట: మండలస్థాయి సీఎం కప్ పోటీలు ఈనెల 15 నుంచి 17వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండలకేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, 100, 400 మీటర్ల రన్నింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 14న పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

రుద్రంగిలో..

రుద్రంగి: ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు మండలంలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మాలోతు శంకర్ తెలిపారు. క్రీడల్లో పాల్గొనే బాల, బాలికలు 15 నుంచి 36 సంవత్సరాల వయస్సు గలవారు సీఎం కప్ క్రీడా పోటీలకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 93477 049439, 9866824012 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కోనరావుపేటలో 16 నుంచి ..

కోనరావుపేట : ఈనెల 16, 17 తేదీల్లో సీఎం కప్ పేరిట మండలస్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలానికి చెందిన 15–36 ఏళ్లలోపు వారు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు 9441456385 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రాజన్నను దర్శించుకున్న అక్కరాజు శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర రజకసంఘం అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్‌ను శాలువాతో సత్కరించారు.

ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన ఆలయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గుండారంలో ఈనెల 14న బంజారా ఆరాధ్యదైవం శ్రీ జగదాంబ ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ భూక్య శంకర్ నాయక్ తెలిపారు. ఆలయాన్ని ముస్తాబు చేశామని, అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని సర్పంచ్ కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

చందుర్తి : సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని మూడపల్లి సర్పంచ్ చిలుక అంజిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీసం రైతులకు తాగునీటి వసతిని కల్పించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింగిల్‌విండో పాలక వర్గం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

బోయినపల్లి : మండలంలోని వరదవెల్లి ఆర్ అండ్‌ఆర్ కాలనీలో శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం గణపతిపూజ, హవనం, స్థాపిత దేవతా యంత్ర విగ్రహాలకు ఫలపుష్పాది, ధాన్యాది, శయ్యాదివాసాలు, రాజోపచార పూజలు నిర్వహించారు. ఆదివారం ఎల్లమ్మ విగ్రహ స్థిర ప్రతిష్ఠతో ఉత్సవాలు ముగుస్తాయని గౌడ సంఘం నాయకులు తెలిపారు. సంకెపెల్లి చంద్రమౌళి శర్మ, రత్నాకర శర్మలు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆరెపల్లి రాజు, ఈడుగు స్వామి, నాగుల సాంబయ్య తదితరులు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మాలోతు సుజాత కోరారు. మండలంలోని గుంటపల్లి చెరువు తండాలో శనివారం ఆమె కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. తండావాసులకు కంటి పరీక్షలు చేసి అద్దాలు అందించారు. కార్యక్రమంలో బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు రాజునాయక్, వైద్యులు సంధ్యారాణి, సంగీత, కార్యదర్శి, ఆశ కార్యకర్తలు, తండావాసులు, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

సిరిసిల్ల టౌన్ : ఆత్మహత్యకు పాల్పడిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోనికి శనివారం బీఎస్పీ నాయకులు నివాళి అర్పించారు. సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను మాట్లాడుతూ.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు బట్టు రాంచంద్రం, చంద్రనాయక్, యారపు రాజబాబు, లింగంపల్లి మధుకర్, మహేందర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ కూల్..

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- కూలర్లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్ల వైపు పరుగులు
- జోరందుకున్న విక్రయాలు

సండే స్పెషల్

సిరిసిల్ల అర్బన్ : రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. దాదాపు 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. దీంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రజలు ఏసీలు, కూలర్లతో పాటు ఫ్రిడ్జిల కొనుగోళ్ల వైపు ఆసక్తి చూపుతుండగా వారం రోజుల నుంచి అమ్మకాలు జోరందుకున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూలర్లు



పలు రకాల ఏసీలు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి..

ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలవైపు పరుగులు తీస్తున్నారు. సామాన్యులు మొదలుకొని అన్నివర్గాల ప్రజలు వారి ఆర్థిక పరిస్థితిని బట్టి కూలర్లు, ఏసీలను కొనుగోలు చేస్తున్నారు.

పెరుగుతున్న విక్రయాలు

వారం రోజల నుంచి కూలర్లు, ఏసీల విక్రయాలు పెరిగాయి. ఉన్నత వర్గాల ప్రజలు ఏసీలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఫ్రిడ్జిలకు డిమాండ్ పెరిగింది. పలు కంపెనీలకు చెందిన కూలర్లతో పాటు, నాగ్‌పూర్ కూలర్ల విక్రయాలు పెరిగాయి. నాగ్‌పూర్ కూలర్ల రూ.1800 నుంచి నాణ్యతను



బట్టి రూ.11వేల వరకు లభ్యమవుతున్నాయి. సాధారణ కంపెనీల కూలర్లు రూ. 3500 నుంచి బ్రాండెడ్ కంపెనీలకు చెందిన కూలర్లు రూ. 14వేల వరకు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు 3 స్టార్, 5 స్టార్ రేటింగ్ గల ఏసీలు మోడల్‌ను బట్టి రూ.35 వేల నుంచి దాదాపు 55 వేలు, ఆపై ధరలలో మార్కెట్లో లభిస్తున్నాయి. వీటితో పాటు ఫ్రిడ్జ్‌ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పలు ఫైనాన్స్ సంస్థలకు చెందిన కంపెనీలు వాయిదా పద్ధతిలో ఫైనాన్స్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. రూ.10 వేలకు పైబడిన కూలర్, ఏసీలు, ఫ్రిడ్జిలను ఎలాంటి వడ్డీ లేకుండా రుణ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి.

అమ్మకాలు పెరిగాయి



వారం రోజల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా ఒక్కసారిగా కూలర్ల అమ్మకాలు పెరిగాయి. కూలర్లను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. నాగ్‌పూర్, పలురకాల కంపెనీలకు చెందిన కూలర్లు అందుబాటులో ఉన్నాయి.

– గౌస్, వ్యాపారి

అన్నిరకాల మోడళ్లు



ఎండలు ముదురుతుండడంతో ఏసీలు, ఫ్రిడ్జ్, కూలర్ల వినియోగం పెరుగుతుంది. గత నెలలో కంటే ఇప్పుడు వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కస్టమర్లను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల మోడళ్లను అందుబాటులో ఉంచుతున్నాం

– గూడూరి నవీన్, సేల్స్‌మెన్, సిరిసిల్ల

ఫైనాన్స్ సౌకర్యంతో



పేద, మధ్య తరగతి, ఉన్నత వర్గాలకు చెందిన ప్రజలకు ఫైనాన్స్ సౌకర్యంతో ఏసీలు, ఫ్రిడ్జి, కూలర్లను వాయిదా పద్ధతిలో ఎలాంటి వడ్డీ లేకుండా ఇస్తున్నాం. ప్రస్తుతం ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, కూలర్లను ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

– సాయికిరణ్, బజాజ్ ఫైనాన్స్, సంస్థ

భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ కార్డులు అందించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

వేములవాడ అర్బన్: ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి ప్రభుత్వం హెల్త్ కార్డులు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. వలస కార్మికులు తక్కువ కూలీకి పని చేస్తున్నందున ఇక్కడి కార్మికులకు పని లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుడు మరణిస్తే రూ.10 లక్షలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. 55 సంవత్సరాలు దాటిన కార్మికులకు రూ.5 వేలు ఫించన్ అందించాలన్నారు. సంఘం నాయకులు శ్రీనివాస్, కొమురయ్య, లక్ష్మణ్ తదితరులున్నారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

సిరిసిల్ల కల్చరల్: పది రోజులుగా అనంతనగర్‌లోని విజ్ఞానవర్ధిని హైస్కూల్‌లో జరుగుతున్న యోగా శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. కార్యక్రమంలో రూరల్ సీఐ ఉపేందర్ మాట్లాడుతూ.. ఒత్తిడితో కూడిన జీవనశైలికి యోగా సాధన ఒక్కటే మార్గమన్నారు. హస్త కళలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. మున్సిపల్ కౌన్సిలర్ గూడూరి భాస్కర్ ప్రాణాయామ సాధనతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో యోగాచార్యుడు ఉప్పల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ తిరుపతి, శ్రీదేవి, మాధురి, సిరాజ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సీఐ ఉపేందర్

'ఎస్సై అనిల్ సస్పెండ్ సరికాదు'

సిరిసిల్ల అర్బన్: జగిత్యాల ఎస్సై అనిల్‌ను ఎలాంటి విచారణ చేపట్టకుండా సస్పెండ్ చేయడం సరికాదని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఏటీ యాదవ్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సై అనిల్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. యాదవ సంఘం నాయకులు వీరవేణి మల్లేశం యాదవ్, ఆసరి బాలరాజ్ యాదవ్, జడల రవియాదవ్, వాసం మల్లేశం యాదవ్, మీరాల శ్రీనివాస్ యాదవ్, పలువురు నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏటీ యాదవ్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థాపిత దేవతాపూజ, అగ్నిప్రతిష్ఠ, గణపతి హవనం, రుద్రాభిషేకం, రుద్ర హోమం, పంచసూక్త హవనం, శాంతిపాఠం, సాయంత్రం మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొమ్మకంటి భాస్కర్, అల్లాడి మురళి, చకిలం మధు, సుధాకర్, భాస్కర్, రాజేశం, నాగేంద్రం, ఐత బాలయ్య, వేద పండితులు గండయ్య శర్మ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

ఆత్మరక్షణ కోసమే కరాటే

వేములవాడ అర్బన్ : వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలో ఒకినోవా స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ లోలెపు రాజు ఆధ్వర్యంలో కరాటే గ్రేటింగ్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. కరాటే చీఫ్ ఎగ్జామినర్ అబ్దుల్ మన్నాన్, కరాటే మాస్టర్లు, విజయ్, దేవయ్య, తిరుపతి, బీఆర్‌ఎస్ నాయకులు జడల శ్రీనివాస్, నీలం శేఖర్, శ్రీనివాస్, జడల చిన్న శ్రీనివాస్, పల్లపు లక్ష్మణ్, నాంపల్లి, దేవయ్య, శంకర్, శ్రీనివాస్, తదితరులున్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

బాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ముస్తాబాద్: సామాజికవేత్తగా రిటైర్డ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా కమమేని బాల్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్ రావు, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు బొంపల్లి సురేందర్‌రావు అన్నారు. ముస్తాబాద్ మాతృశ్రీ గార్డెన్స్‌లో కనమేని బాల్‌రెడ్డి సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వక్తలు మాట్లాడారు. 40 ఏళ్లుగా బాల్‌రెడ్డి వైద్యశాఖలో సేవలు అందించారన్నారు. బాల్‌రెడ్డి కుమారుడు సింగిల్‌విండో మాజీ చైర్మన్ చక్రధర్ రెడ్డి తండ్రి ఆశయాలకు అనుగుణంగా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు హన్మంత్‌రెడ్డి, విఠల్‌నాయక్, గోవర్ధన్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాంగోపాల్, మాజీ సర్పంచ్ వోరగంటి తిరుపతి, బక్కి వెంకటయ్య, శ్రీకాంత్, మల్లారెడ్డి, సంతోష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఉపేంద్ర, ప్రతాప్ రెడ్డి, కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



జనార్దన్‌ను సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: వామపక్ష తీవ్రవాదాన్ని నియంత్రించే క్రమంలో అందించిన ఉత్తమ పోలీసులకు ఇటీవలే కేంద్ర ప్రభుత్వం 'పోలీస్ అంత్రిక్ సురక్ష' మెడల్ సిరిసిల్ల ఠాణా రైటర్ జనార్దన్‌కు దక్కింది. ఈనెల 10న రవీంద్రభారతిలో ఆయన మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఎస్పీ అఖిల్ మహాజన్ జనార్దన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పాడిగేదె మృతి

సిరిసిల్ల అర్బన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని పట్టణంలోని శాంతినగర్‌లో మామిండ్ల శ్రీనివాస్‌కు చెందిన పాడిగేదె శనివారం మృతిచెందింది. శ్రీనివాస్‌కు చెందిన నాలుగు గేదెలను మేత కోసం సిరిసిల్ల శివారులోకి తీసుకెళ్లారు. నర్సింగ్ కళాశాల సమీపంలో రోడ్డు దాటుతున్న గేదెను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. రూ. 60వేల విలువైన గేదె మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు.

బురదలో పడి మరో గేదె..

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల) : మండలకేంద్రంలోని గంట దేవాగౌడ్‌కు చెందిన పాడి గేదె శనివారం బురదలో చిక్కుకొని మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. రోజులాగానే తనపొలం వద్ద గేదెను కట్టేశాడు. మధ్యాహ్నం వెళ్లి చూసేసరికి బురదలో పడి మృతిచెంది ఉంది. దీంతో రూ.70వేల వరకు నష్టం వాటిల్లినట్లు దేవాగౌడ్ తెలిపాడు. బాధిత రైతును ఆదుకోవాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

చిత్ర కథ



శిథిలావస్థలో పశు వైద్యశాల

వీర్నపల్లి: మండల కేంద్రంలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడుతుండటంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని సిబ్బంది భయంతో విధులు నిర్వహిస్తున్నారు. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు రేణుక, ఇన్‌చార్జి పశువైద్యాధికారి వీర్నపల్లి
మొబైల్ నెం : 95733 54356

అన్ని కులాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట : అన్ని కులాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం వల్లంపట్ల గ్రామ ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్యేను కలిసి పెద్దమ్మ జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్నివర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని, దళితబంధు, చేపపిల్లల పంపిణీ, సబ్సిడీ వాహనాలు, రైతుబంధు, రైతుబీమాతో పాటు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణా రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, గ్రంథాలయ డైరెక్టర్ మల్లెంకి శ్రీనివాస్, సర్పంచ్ అనసూయ, ఎంపీటీసీ స్రవంతి, నాయకులు తదితరులున్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ముదిరాజ్‌లు

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఎలుక సమత శనివారం అనారోగ్యంతో మృతిచెందగా ఆమె ఎమ్మెల్యే రసమయి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

- మున్సిపల్ ఛైర్ పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: నిరుద్యోగులు, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. శనివారం సిరిసిల్ల బీసీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. శిక్షణలో పాల్గొన్న నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కంచర్ల రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్స్‌ను అందిస్తున్న జిందం కళ

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



సమ్మె చేస్తున్న వీఓఏలు

బోయినపల్లి : మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట కళ్లకు గంతలతో వీఏఓలు నిరసన వ్యక్తం చేశారు. వేతనం పెంచాలని, ప్రమాద బీమా రూ. 5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని వీవోఏలు నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకుసమ్మె విరమించేది లేదన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

వేములవాడరూరల్: డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ చేస్తున్న వీవోఏల సమ్మె శనివారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ప్లకార్డులతో వీవోఏలు వినూత్న నిరసన తెలిపారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీవోఏలు లక్ష్మీ, శైలజ, పిట్టల సుమలత, రాజేశ్వరి, అనూష, మహేశ్వరి, గంగ, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి..

చందుర్తి : మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె శనివారం ఎనిమిదో రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రతను కల్పించి, నెలకు రూ.26వేతనాలను చెల్లించాలని కోరుతూ సమ్మెకు దిగారు, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని వీవోఏల మండల అధ్యక్షురాలు స్వరూప, కార్యదర్శి వినోద తెలిపారు. ఇక్కడ వీవోఏలు అజిదా, గంగ, మమత, పద్మ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. కనీసం రూ. 26 వేల గౌరవ వేతనం చెల్లించి తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఇక్కడ అన్నిగ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

పరామర్శ

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు గుగ్గిళ్ల పర్శరాములు తండ్రి ఇటీవల మృతిచెందగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు శనివారం పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజన్న, అమర్ రావు, రాజేశ్వర్ రావు, తదితరులున్నారు.